క్లుప్తంగా

అధైర్య పడవద్దు అండగా ఉంటా


శ్రీనువాసులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆపార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పతున్నారు. దాడులకు భయపడవద్దు. పార్టీ, నేను ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సోగాల్‌పల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనువాసులు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను అందరు కలిసికట్టుగా ఉండి ధైర్యంగా ఎదుర్కొందామన్నారు. ఎదైన సమస్య వస్తే ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. శ్రీనువాసులు కుటుంబ సభ్యులపై జరిగిన దాడి గురించి వారిని అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

జమ్మలమడుగు : మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన నిర్వహిస్తారని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరూ తప్పక హాజరు కావాలన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి


గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : నీట్ 2024 పరీక్ష నిర్వహణపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయడం కోసం ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్ లోని గాంధీ విగ్రహం వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలంటూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఒక సెంటర్ నుంచి భారీగా విద్యార్థులకు ర్యాంకులను సాధించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఇంటర్ బోర్డు అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ డిమాండ్ చేశారు. కడప పీడీఎస్‌యూ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వెంపల్లిలోని ఓ కార్పొరేట్ కళాశాల యాజమాన్యం నకిలీ డ్యాక్యుమెంట్‌తో అనుమతులు సాధించారని, ఉన్నతాధికారులను పంపి విచారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఘ్నేష్, మనోజ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయంలో ఎమ్మెల్యే

అట్లూరు : మండల పరిధిలోని రెడ్డిపల్లిలో వెలసిన పోలేరమ్మ, పోతురాజు సమేత ఆలయంలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా సోమవారం పూజలు నిర్వహించారు. పోలేరమ్మ తిరునాల సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు మేరకు ఆమె పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని లక్ష్మిరెడ్డి నివాసంలో విందు ఆరగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, ముడమాల భాలమునిరెడ్డి, ఆందూరు రామకృష్ణారెడ్డి, స్థానిక మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కడప నగరాన్ని ప్రగతి పథంలో నిలపాలి

కడప ఎడ్యుకేషన్ : కడప నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రగతి పథంలో నడపాలని అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు సురేష్ బాబు, జిల్లా విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి శంకరయ్య అన్నారు. కడప శాసనసభ నియోజకవర్గానికి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మాధవీరెడ్డి స్వగృహంలో ఆమెను అఖిల భారత అభ్యుదయ వేదిక జిల్లా నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రాబోయే ఐదేళ్లలో కడప నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరి సహాయ సహకారాలు తీసుకువెళ్తానని ఎమ్మెల్యే మాధవీరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ వేదిక కార్యవర్గ సభ్యులు మహబూబ్‌బాషా, హైదర్‌అలీ, గౌరీ శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

పులివెందుల టౌన్ : బక్రీద్ పండుగను సోమవారం ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పలు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఉదయం 6.30 గంటలనుండి స్థానిక శ్రీరామాహాల్ వద్ద ఉన్న పాత ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పెద్ద మసీదు, జామియా మసీద్ తదితర మసీదులలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం 10 గంటల వరకు పార్నపల్లె రోడ్డులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో ముస్లిం సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మత పెద్దలు బక్రీదు పండుగ గురించి వివరించారు. త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ పండుగ అన్నారు. దానధర్మాలు చేయడం అలవరచుకోవాలన్నారు. అనంతరం దానధర్మలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బంధు, మిత్రులకు విందులు ఏర్పాటు చేశారు.

కమలాపురంలో..

కమలాపురం : ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం కమలాపురం పట్టణంతో పాటు మండల పరిధిలోని జీవంపేట, పెద్దచెప్పలి, చిన్న చెప్పలి, పందిళ్లపల్లె, కోగటం, మొలకవారిపల్లె, విభరాపురం, గంగవరం, అప్పాయపల్లె, సి.గోపులాపురం తదితర గ్రామాలలో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో కలసి ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు నూతన సాంప్రదాయ దుస్తులు ధరించి అత్తర్, సుర్మా పెట్టుకుని స్థానిక ఈద్గా మైదానానికి చేరుకున్నారు. రెండు రకాతుల ప్రత్యేక నమాజ్ సామూహికంగా ఆచరించారు. ప్రభుత్వ ఖాజీ సయ్యద్ జాహిద్ హుసేన్ నమాజ్ చదివించారు. మరో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ నాసీర్ హుసేని బక్రీద్ పండుగ ప్రత్యేకతను బయాన్ రూపంలో వివరించారు. అర్హత ఉన్న ప్రతి ముస్లిం ఖుర్బాని ఇవ్వాలని ఆయన సందేశం ఇచ్చారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం జాహిద్ హుసేన్ దువా చేశారు. దర్గా మస్జిద్‌లో పీఠాధిపతి హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక నమాజ్ ఆచరించారు. అంతకు ముందు పీఠాధిపతి భక్తులకు సందేశం అందించారు. భక్తులంతా పీఠాధిపతికి ఈద్ ముబారక్ తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : అల్లాపేరిట దానం చేస్తే తగిన ప్రతిఫలం దక్కుతుందని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, కమాలియా ఆస్తానయే పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్‌పాషా ఖాద్రీ తెలిపారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా వేరువేరుగా ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు మంచి పనులు చేస్తే పిల్లలు కూడా ఆ వరుసలో నడుస్తారు. సమాజంలో సయ్యద్ వంశస్తులు చేసే ప్రతి పని అల్లా పేరిట చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రార్థన అనంతరం ఒకరికి ఒకరు శుభాకాంక్షలను తెలుపుకున్నారు. కార్యక్రమంలో సయ్యద్‌షా తాహీర్ పీరా ఖాద్రీ, హాఫీజ్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని సోమవారం మసీదులు, ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక అడ్డరోడ్డులోని మక్కామసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి అక్కడ నుండి ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్లామిక్ దార్మికవేత్త మౌలానా షఫి బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. యాచకులకు దానధర్మాలు చేశారు. బంధు మిత్రులతో విందు భోజనాలు ఏర్పాటు చేశారు.


ఈద్గాలో ప్రసంగిస్తున్న పీఠాధిపతి


జమ్మలమడుగులో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వల్లూరు, పెద్దపుత్త, దిగువపల్లె, తప్పెట్ల, తొల్లగంగనపల్లె, ధర్మాపురం కాలనీ, పైడికాలువ, కోట్లూరు, గణేష్‌పురం తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. మత గురువులు సందేశాలను ఇచ్చారు. అనంతరం ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలు దానాలను చేశారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలు బంధువులు, స్నేహితులతో కళకలలాడాయి.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : సింహాద్రిపురం, గురిజాల, కోవరంగుంటపల్లె, బిదినంచెర్ల, బలపనూరు తదితర గ్రామాల్లో బక్రీదు పండుగను పురస్కరించుకుని ముస్లింలు ఈద్గా మైదానాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల, నెమళ్లదిన్నె, జంగాలపల్లె, సుద్దపల్లె, పెద్దముడియం, గుండ్లకుంట, బోడు తిప్పలపాడు, జె.కొట్టాలపల్లె గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.ఆయా గ్రామాలలో ఈద్గా దర్గాల వద్ద ప్రత్యేక పార్ధనలు చేశారు. మత గురువులు మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ అల్లా చూపిన మార్గంలో నడవాలని తెలిపారు.

వేములలో..

వేముల : మండల వ్యాప్తంగా ముస్లింలు సోమవారం బక్రీదు పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వేముల, వేల్పుల, పెద్దజూటూరు గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి బంధు, మిత్రులతో కలసి బక్రీదు పండుగను ఘనంగా జరుపుకున్నారు.


కమలాపురం ఈద్గాలో బయాన్ చేస్తున్న నాసీర్ హుసేనీ

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని నేలతిమ్మాయపల్లె, యు.రాజుపాలెం, ఉరుటూరు, గంగిరెడ్డిపల్లె, అనిమెల, ఎస్.పాలగిరి తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వమించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ పండుగ విశిష్టత గురించి మత పెద్దలు వివరించారు. దాన ధర్మాలు నిర్వహించారు. అనంతరం బంధువులు, స్నేహితులకు విందు బోజనాలు ఏర్పాటు చేశారు.


వేంపల్లె ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు


పెద్దపుత్త మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సింహాద్రిపురం : ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు


వేముల ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు


యు.రాజుపాలెంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అంధ విద్యార్థినికి ఆర్థిక సాయం

పులివెందుల టౌన్ : పట్టణంలోని రోటరీపురానికి చెందిన అంధురాలు వెల్లెపు రోజా తల్లిదండ్రులు లేకపోవడంతో తన నాయనమ్మ సంరక్షణలో జీవిస్తోంది. డిగ్రీ పూర్తి చేసిన రోజా ఇటీవల ఎడ్‌సెట్ ప్రవేశపరీక్ష రాసి ఎర్రగుంట్ల బీఈడీ కళాశాలలో అడ్మిషన్‌కు పదివేల రూపాయలు చొప్పున రూ.40వేలు చెల్లించాల్సి ఉంది. ఆర్థికస్తోమత లేక రోజా విద్యను మధ్యలో నిలిపివేసింది. ఈ పరిస్థితిని గుర్తించిన వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ వివేకానంద ఇంగ్లీషు మీడియం పాఠశాల డైరెక్టర్ సోమశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రోజా విద్యాభ్యాసానికి అవసరమైన రూ.40 వేలు మొత్తాన్ని అందజేస్తానన్నాడు. మొదటి విడతగా రూ.10వేలు తన పాఠశాలకు పిలిపించి విద్యార్థిని రోజాకు అందజేశారు. సోమశేఖర్‌రెడ్డి సేవా స్ఫూర్తిని సంఘమిత్ర సేవాసంస్థ అధ్యక్షుడు సిరాజుద్దీన్, పలువురు అభినందించారు.


రోజాకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్‌వీఈ డైరెక్టర్ సోమశేఖర్‌రెడ్డి

గడువు దాటిన సిలిండర్లతో జాగ్రత్త

కడప వైఎస్ఆర్ సర్కిల్: నిత్యం వినియోగించే ప్రతి వస్తువుకు గడువు తేదీ ఉంటుంది. కాలం చెల్లిన సిలిండర్లను వినియోగిస్తే.. ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలున్నాయి. సిలిండర్లపై ఉండే గడువు తేదీలపై అవగాహన కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారు. ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటుచేసిన దాఖలాలు నగరంలో ఎక్కడా కనిపించలేదు. ప్రతి ఇంటిలో గ్యాస్ సిలిండర్ వినియోగం తప్పని సరిగా మారిపోయింది. గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్ తీసుకోగానే దానిపై ఉన్న గడువు తేదీని తప్పక గుర్తించాలి.

సిలిండర్ రింగ్ కింద భాగంలో తేదీ ముద్రించి ఉంటుంది. ఏడాదిలో 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ఏ, బీ, సీ, డీగా అక్షరాలు రాస్తారు. అక్షరం ఏ అయితే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు, బీ అయితే ఏప్రిల్, మే, జూన్ నెలలకు, సీ అయితే జులై, ఆగస్టు, సెప్టెంబర్ సంబంధించినదిగా, డీ అక్షరం అయితే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించినదిగా గుర్తించాలి. సిలిండర్ డెలివరీ అయిన వెంటనే ఆ అక్షరాన్ని గుర్తించి సిలిండర్ ఏ నెలకు చెందినదో తెలుసుకోవాలి. ఒక వేళ గడువు తీరిన సిలిండర్ ఇస్తే తిరిగి ఏజన్సీ వారికి ఇచ్చి గడువున్న సిలిండర్ తీసుకోవాలి. సిలిండర్‌ను ఎక్కువ కాలం వాడేయకుండా పక్కన పెట్టి వాడటంతో ప్రమాదంగా మారవచ్చు. సిలిండర్‌పై అక్షరాన్ని గుర్తించి అది ఏ నెలకు చెందినదో తెలుసుకొని వాడుకుంటే మంచిది. దీనిపై రెవెన్యూ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సాగుకు యంత్ర సాయం

కొన్నేళ్ల క్రితం వ్యవసాయం శారీరక శ్రమ ఆధారంగా నడిచింది. ప్రస్తుతం ప్రతి విభాగంలో యంత్ర పరికరాల వినియోగం పెరిగింది. సాంకేతికత విస్తరిస్తుండటంతో రైతులకు చేతి కష్టం తగ్గించేలా యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ముందుగా ట్రాక్టర్లు.. అనంతరం వరికోత, మినుము, పెసర, కొర్ర, వేరుశనగ, కుసుమ దిగుబడుల నూర్పిడికి అవసరమైన యంత్రాలు వచ్చాయి. పంటలపై పురుగు మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్, పశుగ్రాసాన్ని కట్ట కట్టే యంత్రాలు ప్రవేశపెట్టారు. యంత్ర సాయం రావడంతో పంటల సాగు సులభతరం అవుతోందని రైతులు చెబుతున్నారు. – రాజుపాళెం



మినుము పంటను నూర్పిడి చేసే యంత్రం


యంత్ర సాయంతో పశుగ్రాసాన్ని కట్టలు కడుతున్న దృశ్యం


ట్రాక్టర్‌తో జొన్న విత్తనం సాగు యంత్రం

భాషా పరిశోధకుడు తిరుమల రామచంద్ర

కడప కల్చరల్: రచయిత, పరిశోధకుడు విలక్షణమైన శైలి గలవారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పరిశోధక సహాయకులు డా.సి.శివారెడ్డి పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో తిరుమల రామచంద్ర జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత తిరుమల రామచంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాత్రికేయులుగా, సంపాదకులుగా, కవిగా, నాటకకర్తగా, విమర్శకులుగా, భాషావేత్తగా, అనువాదకులుగా ప్రముఖుడని, భాషాసేవా సంపన్నుడని తెలిపారు. డా.సి.శివారెడ్డి మాట్లాడుతూ అనువాదంలో కూడా ఆయన మంచిపేరు గడించారన్నారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు మాట్లాడుతూ పాత్రికేయుడిగా తిరుమల రామచంద్ర విశిష్టత, విలక్షత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె రామాంజనేయులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు

అట్లూరు : మండల పరిధిలోని రెడ్డిపల్లి పోలేరమ్మ తిరునాల సందర్భంగా సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ బండలాగుడు పోటీలలో ఆరు జతలు ఎద్దు పాల్గొన్నాయి. అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన కె.రమేష్ ఎద్లకు మొదటి బహుమతి రూ.80 వేలు, రెండవ బహుమతి కడప జిల్లా చౌటపల్లికి చెందిన మార్తాల చంద్రోబులరెడ్డి రూ.60 వేలు, మార్తాల చంద్ర ఓబుల్‌రెడ్డికి చెందిన రెండవ జత ఎద్లు మూడవ బహుమతి రూ.40 వేలు, అనంతపురం గార్లదిన్నెకు చెందిన కె.రామాంజనేయులు ఎద్లు నాల్గవ బహుమతి రూ.20 వేలు, అనంతపురం జిల్లా మెడిమకలపల్లికి చెందిన తోట తిరుపాల్‌రెడ్డి ఎద్లు ఐదవ బహుమతి రూ.10 వేలు, వెస్సార్ జిల్లా రంగోరిపల్లికి చెందిన మహిదర్‌రెడ్డి ఎద్లు రూ.5 వేలు గెలుచుకున్నాయి.

రంగస్థల నాటకానికి చిలకమర్తి కీర్తి

కడప కల్చరల్: చిలకమర్తి లక్ష్మీ నరసింహం తెలుగు రంగస్థల నాటకరంగంలో కీర్తి గడించంఆరని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో సోమవారం చిలకమర్తి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ చిలకమర్తి రాసిన గయోపాఖ్యానానికి విశేషమైన పేరు ప్రఖ్యాతులు లభించాయన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి ప్రసంగిస్తూ ఆంధ్ర మిల్టన్‌గా ప్రసిద్ధులైన చిలకమర్తికి పేరుందని, అప్పట్లోనే దళితులకు ప్రత్యేక పాఠశాల ఏర్పాటుచేసి సంచలనం అయ్యారన్నారు. డాక్టర్ పాలెం వేణుగోపాల్ మాట్లాడుతూ కథలు, నవలలు, నాటకాలు, అనువాదాలు రాసిన గయోపాఖ్యానమే కీర్తి తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా గయోపాఖ్యానం నాటకంలోని ప్రసిద్ధ పద్యాలను స్థానిక నటులు ఆలపించారు. నాటకంలో పాత్రలు పోషించిన ఆమూరు విశ్వనాథరెడ్డి, భూమిరెడ్డి పోలిరెడ్డి, సురభి రామచంద్రయ్య, కర్నాటి నరసింహరెడ్డి, పట్నం సుబ్బరాయుడును ఘనంగా సన్మానించారు. రంగస్థల కళాకారులైన మండల మురళి, బ్యాంకు గంగయ్య, తిప్పలూరు ఓబులేసు, బాల ఓబయ్య, శ్రీనివాసరాజు, తపలిస్ట్ గంగయ్య, రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.


రంగస్థల కళాకారులను సన్మానిస్తున్న రచయితల సంఘం ప్రతినిధులు

ఆర్జేడీపై అవినీతి ఆరోపణలు తగవు

ప్రొద్దుటూరు : జిల్లా ప్రాంతీయ సంయుక్త విద్యాశాఖాధికారి (ఆర్‌జేడీ) రాఘవరెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడం తగదని విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ఏఐఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం నరసింహులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆర్జేడీపై నిందారోపణలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో డీఈఓగా రాఘవరెడ్డి పనిచేసినప్పుడు ఎంపీ లెటర్ ప్యాడ్ తెచ్చుకొని కొందరు ఉద్యోగం కావాలని ప్రయత్నిస్తే.. నిజాయితీగా ఆయన వారిని జైలుకు పంపారన్నారు. వృత్తి ధర్మంలో భాగంగా ఉపాధ్యాయులను గాడిలో పెట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కృషి చేస్తున్నారన్నారు. అలాంటి ఆర్జేడీపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేయడం శోచనీయమని తెలిపారు. నిజాయితీ పరులైన అధికారులు సక్రమంగా పని చేసుకునేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పుల్లయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు

గాయత్రిదేవికి ప్రత్యేక పూజలు

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం గాయత్రిదేవి జయంతిని పురస్కరించుకుని గాయత్రి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కార్తీక్ స్వామి అమ్మవారికి అభిషేకం, మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం యోగభోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అలంకరణ చేసి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు మహమ్మారమ్మ జాతర

స్థానిక ఎస్‌బీఐ కాలనీలో వెలసిన మహమ్మారమ్మ జాతర మంగళ, బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్ ప్రసాద్‌బాబు తెలిపారు. కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు, పెద్దల సహకారంతో ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, దీలు, బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు. బుధవారం పగలు తిరుణాల అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.


ప్రత్యేక అలంకరణలో గాయత్రీమాత

అలరించిన నృత్య ప్రదర్శనలు

పులివెందుల టౌన్ : బక్రీదు పండుగను పురస్కరించుకుని స్థానిక శిల్పారామం, వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శిల్పారామం సందడిగా కనువిందు చేసింది.

అక్కడ ఉన్న ఊయలలు, జారుడుబండలు, వివిధ రకాల ఆటవస్తువులతో, జిప్‌వే, బోటింగ్ సికార్లు కొడుతూ ఎంజాయ్ చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బక్రీదు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మదనపల్లె సూర్య డ్యాన్స్ అకాడమి మాస్టర్ సూర్య ఆధ్వర్యంలో శిష్య బృందం జానపద, వెస్ట్రన్, కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే పద్మవ్యూహంలో సినిమా టీమ్ హీరో ప్రవీణ్‌రాజ్ కుమార్, హీరోయిన్ శశిక, డైరెక్టర్ సంజయ్‌రెడ్డి చేతులమీదుగా మిని టెలివిజన్‌లో బావబావ ఓ బావ అను రాయలసీమ లిరికల్ ఫోక్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ పర్యవేక్షించారు. అలాగే వైఎస్సార్ ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్‌లో కడప కిషోర్‌డ్యాన్స్ అకాడమి శిష్యబృందంచే నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆనందింపజేశాయి.


కోలాటం చేస్తున్న చిన్నారులు


వైఎస్సార్ ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్‌లో చిన్నారుల నృత్యప్రదర్శనలు